సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం : 2 : మే : 2024



సోమశిలలో 8.16 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 8.16 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 210 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,190
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,555
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,752
నవర (8 గ్రాములు)	రూ.54,016



టీడీపీని ఓడించండి

ఈ ఎన్నికల్లో టీడీపీని ఓడించాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోరారు. వెంకటాచలం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

8లో

న్యూస్‌రీల్

రూ.3.72 లక్షల స్వాధీనం



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): నగదు, మద్యం అక్రమ రవాణా కట్టడే లక్ష్యంగా పోలీస్ అధికారులు విస్తృత తనిఖీలను మంగళవారం రాత్రి నుంచి బుధవారం వరకు నిర్వహించారు. సంగం పరిధిలో రూ.లక్ష, ముత్తుకూరులో రూ.72,659, గుడ్లూరులో రూ.రెండు లక్షలను ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని ఆదాయపన్ను అధికారులకు అప్పగించారు.

- జలదంకి పరిధిలో 45, వింజమూరులో 10, ఆత్మకూరులో 18.. ఎస్‌ఈబీ అధికారుల ఆధ్వర్యంలో 190 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసులు నమోదు చేశారు.
- ఆత్మకూరు పరిధిలో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరి దుర్మరణం

- ఒకరికి గాయాలు

ఇందుకూరుపేట: బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు మరణించగా, ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని జగదేవిపేటలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జగదేవిపేటకు చెందిన కొంగి శివకృష్ణ (35) బైక్‌పై మైపాడు నుంచి నెల్లూరు వైపు బయల్దేరారు. జగదేవిపేట సెంటర్ వద్ద రోడ్డు దాటేందుకు యత్నిస్తుండగా, కోడూరుపాడు చెందిన చాన్‌బాషా (18), రియాజ్, అస్లామ్ అలీ బైక్‌పై వస్తూ ఢీకొన్నారు. ప్రమాదంలో శివకృష్ణ అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన చాన్‌బాషా, రియాజ్‌ను 108 సాయంతో నెల్లూరు తరలించారు. అప్పటికే చాన్‌బాషా మరణించారని వైద్యులు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన రియాజ్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై వీరేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలతో కార్మికుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని.. హక్కుల సాధనకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ నెల్లూరు నగరాధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడేను పురస్కరించుకొని నగరంలోని వివిధ ప్రాంతాల్లో సీఐటీయూ పతాకాలను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం భారీ ర్యాలీని నిర్వహించారు. ప్రస్తుతం కార్పొరేట్ శక్తులతో ప్రభుత్వాలు కుమ్మక్కై కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆరోపించారు. నేతలు చంద్రారెడ్డి, శ్రీనివాసులు, అజయ్‌కుమార్, మూలం ప్రసాద్, అంకయ్య, రవి, నాగూర్, శరత్, సుధాకర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్లతో అధికారుల మిలాఖత్

- నిబంధనలకు తిలోదకాలు
- పింఛన్లు అందజేసిన టీడీపీ నేతలు



పింఛన్లు పంపిణీ చేస్తూ సోషల్ మీడియాలో టీడీపీ నేతలు పెట్టిన ఫొటోలు

విడవలూరు: ఎన్నికల కమిషన్ ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారు. టీడీపీ నేతలతో కుమ్మక్కై వారితో పింఛన్లు పంపిణీ చేయించారు. అవ్వాతాతలకు ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా పింఛన్లు అందించే ప్రక్రియకు ఆటంకాలు కలిగించిన పచ్చ బ్యాచ్.. ఇప్పుడు అధికారులను లోబర్చుకొని తమ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేయడంపై వివాదం చెలరేగింది.

ఇదీ వ్యవహారం..

విడవలూరు మండలం అన్నారెడ్డిపాళెంలో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి సౌజన్య బుధవారం చేపట్టారు. అయితే స్థానిక టీడీపీ నేత సింహాద్రి అయ్యప్ప అధికారులతో కుమ్మక్కై నగదు మొత్తం, పింఛన్ల జాబితాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ నగదును స్వయంగా పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీ చేస్తూ తీసుకున్న ఫొటోలను సోషల్ మీడియాలో టీడీపీ నేతలు ఉంచారు. ఈ విషయమై వైఎస్సార్‌సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

రౌడీయిజంతో భూకబ్జాలు



రోడ్‌షోకు హాజరైన జనాలను ఉద్దేశించి మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అరాచకాలకు అంతే లేదు
- త్వరలో ఆయన జైలుకెళ్తారు
- భూములను ప్రభుత్వానికి అప్పగిస్తాం
- రోడ్‌షోలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రౌడీయిజానికి అంతే లేకుండా పోయిందని, భూములను విచ్చలవిడిగా ఆక్రమించుకున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని 24వ డివిజన్లో పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ స్రవంతి తదితరులతో కలిసి బుధవారం నిర్వహించిన రోడ్‌షోలో విజయసాయిరెడ్డి మాట్లాడారు. శ్రీధర్‌రెడ్డి కబ్జా చేసిన భూములను తిరిగి ప్రభుత్వానికి అప్పగిస్తామని స్పష్టం చేశారు. నెల్లూరు ప్రజలకు రౌడీయిజం నచ్చదని, అయితే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఓ రౌడీలా తయారయ్యారని మండిపడ్డారు. పదేళ్లలో ఆయన వందల కోట్లను సంపాదించారని చెప్పారు. ఆయన్ను చూసి ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, త్వరలోనే జైలుకెళ్లడం ఖాయమన్నారు.

దమ్ముంటే నన్ను బెదిరించు..

చిన్న వాళ్లను బెదిరించడం కాదని, దమ్ముంటే తనను బెదిరించాలని కోటంరెడ్డికి విజయసాయిరెడ్డి సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో నెల్లూరుకు ఏమి చేయబోతున్నామనే అంశాలతో కూడిన మేనిఫెస్టోను రూపొందించామని, జిల్లా అభివృద్ధి చెందాలంటే తమ పార్టీకి ఓటేయాలని కోరారు.

ఆయనకు ఓటేస్తే ప్రశాంతత మాయం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి టీడీపీలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చేరారని ఆరోపించారు. ప్రజాసేవను మరిచి దందాలకు అలవాటు పడ్డారని విమర్శించారు. ప్రభుత్వాధికారిపై దౌర్జన్యానికి పాల్పడితే అప్పట్లో సీఎం చట్టపరమైన చర్యలకు ఆదేశించిన అంశాన్ని గుర్తుచేశారు. కోటంరెడ్డి లాంటివారికి ఓటేస్తే ప్రశాంతత ఉండదని చెప్పారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి

తప్పుడు ప్రచారాలతో టీడీపీ పైశాచికానందం

తనపై తప్పుడు ఆరోపణలతో టీడీపీ పబ్బం గడుపుకుంటోందని విజయసాయిరెడ్డి మండిపడ్డారు. విశాఖపట్నంలో తాను భూములను ఆక్రమించానంటూ అవాస్తవాలను వ్యాప్తి చేస్తున్నారని ధ్వజమెత్తారు. తాను వెంకటేశ్వరస్వామి భక్తుడినని.. ఏ భూమినీ ఆక్రమించలేదని ఆయనపై ప్రమాణం చేసి చెప్తున్నానన్నారు. విశాఖపట్నంలో తనకు ఒక ఫ్లాట్ మాత్రమే ఉందని వివరించారు.

రూ. 69.2 కోట్లతో సంక్షేమం

24వ డివిజన్ అభివృద్ధి, సంక్షేమానికి గడిచిన ఐదేళ్లలో రూ.69.2 కోట్లను ప్రభుత్వం వెచ్చించిందని పేర్కొన్నారు. రూ.ఐదు కోట్లతో వివిధ రోడ్లను నిర్మించిందన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పూర్తి చేస్తామని ప్రకటించారు. పడారుపల్లి బ్రిడ్జి నుంచి హౌసింగ్ బోర్డు సెంటర్‌కు రెండు వరుసల రోడ్డును నిర్మిస్తామని వెల్లడించారు. డివిజన్లో హైస్కూల్ ఏర్పాటుకు రెండెకరాల భూమి అందుబాటులో ఉందని, పాఠశాలను త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కల్లూరుపల్లిలో షెడ్యూల్డ్ కులాల వారికి ఒక కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తామని చెప్పారు.

కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ కార్యక్రమాలు

కరోనా సమయంలోనూ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్విరామంగా అమలు చేశారని ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని చెప్పారు. ఆచరణ సాధ్యమయ్యే హామీలనే మేనిఫెస్టోలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పొందుపర్చారని వివరించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా తాను బాధ్యతలు స్వీకరించాక వివిధ అభివృద్ధి పనులను చేపట్టానని గుర్తుచేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లో పూర్తి చేస్తామని వెల్లడించారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు జగదీష్ గుప్తా, నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, రమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, డివిజన్ ఇన్‌చార్జీలు సునీల్‌యాదవ్, ఉడతా మురళీయాదవ్, సురేంద్రరెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, పాతపాటి పుల్లారెడ్డి, స్వర్ణా వెంకయ్య, పాలకీర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో నెల్లూరు సత్తా



- ఒకేసారి తొమ్మిది మంది ప్రాతినిధ్యం
- 2004 నుంచి 2010 మధ్య ఈ ఘనత

ఆత్మకూరు: సాధారణంగా ఒకే జిల్లాకు చెంది పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే వారి సంఖ్య ఒకట్రెండుకంటే ఎక్కువ ఉండదు. కానీ ఈ అంశంలో నెల్లూరు జిల్లా రికార్డు సృష్టించింది. 2004 నుంచి 2010 మధ్య జిల్లాకు చెందిన తొమ్మిది మంది లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రాతినిధ్యం వహించి నెల్లూరు ఖ్యాతిని ఇనుమడింపజేశారు.

- నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పనబాక లక్ష్మి, తిరుపతి నుంచి చింతామోహన్, ఒంగోలు నుంచి మాగుంట శ్రీనివాసులురెడ్డి, విశాఖపట్నం నుంచి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, నర్సరావుపేట నుంచి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించారు.
- విజయవాడ లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందిన లగడపాటి రాజగోపాల్ సైతం సంగం మండలానికి చెందిన వ్యక్తి కావడం విశేషం.
- ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఇందుకూరుపేట మండలం లేబూరుకు చెందిన తిక్కవరపు సుబ్బిరామిరెడ్డి, సీపీఎం నుంచి మధు రాజ్యసభలో ప్రాతినిధ్యం వహించారు. ఇలా ఒకే దఫాలో జిల్లాకు చెందిన తొమ్మిది మంది వివిధ ప్రాంతాల నుంచి లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రాతినిధ్యం వహించడం ఓ రికార్డుగా నిలిచిపోయింది. దీన్ని బద్దలకొట్టడం సాధ్యం కాదంటే అతిశయోక్తి కాదు.



వెంకయ్యనాయుడు



రాజమోహన్‌రెడ్డి

ధనవంతులకే చంద్రబాబు అందలం

- వైఎస్సార్‌సీపీ కోవూరు అభ్యర్థి ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్రంలో 2014 ఎన్నికల సమయంలో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించి.. అనంతరం వీటిని విస్మరించిన చంద్రబాబు.. ధనవంతులనే అందలమెక్కించారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవూరు అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని రాముడుపాళెం, కొమరిక, నరసాపురం, సోమరాజుపల్లి, కొరుటూరు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించనుందని స్పష్టం చేశారు. చంద్రబాబు తరహాలో ప్రజలను మోసం చేయడం జగన్‌మోహన్‌రెడ్డికి చేతకాదని చెప్పారు. బీజేపీ జాతీయ నేత సమక్షంలో టీడీపీ మేనిఫెస్టోను చంద్రబాబు, పవన్ కల్యాణ్ విడుదల చేశారని, వీటిని నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని చెప్పారు. ఊసరవెల్లిలా రంగులు మార్చడం వారి నైజమని మండిపడ్డారు. దేశంలోని ప్రతి రాష్ట్ర పరిస్థితిపై ప్రధాని వద్ద నివేదికలుంటాయని తెలిపారు. మనం అధికారంలోకి రాబోతున్నామంటూ మోదీ వద్ద చంద్రబాబు మాయ చేసి ఉంటారని విమర్శించారు. నెల్లూరు, సంగం బ్యారేజీలు వైఎస్సార్ ప్రసాదించినవేనని గుర్తుచేశారు. కరోనా సమయంలోనూ తన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలను ఆదుకున్న వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

అధికారం కోసం దేనికైనా దిగజారుతారు

సీఎం పీఠం కోసం దేనికైనా దిగజారడం చంద్రబాబు నైజమని, అందుకే బీజేపీ, జనసేనతో చేతులు కలిపారని విమర్శించారు. చివరికి షర్మిలకు సైతం సూట్‌కేస్‌లు ఇచ్చి తన వైపు తిప్పుకొని పీసీసీ అధ్యక్షురాలిగా చేసి సీఎంపై పోరాటాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ఒకవేళ చంద్రబాబు సీఎం అయితే పథకాలను రద్దు చేసి పాత పద్ధతులను మరోసారి తెరపైకి తీసుకొస్తారన్నారు. ఇళ్ల స్థలాలు పేదలకు రాకుండా కోర్టులను ఆశ్రయించి స్టే తీసుకొచ్చారని విమర్శించారు. వేమిరెడ్డి దంపతులకు రాజ్యసభ, టీటీడీ పదవులను జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని, అయితే నెల్లూరు సిటీ, కందుకూరు టికెట్లను మైనార్టీ, బీసీకి కేటాయించారనే కారణంతో వీరు పార్టీని వీడారని మండిపడ్డారు. కోవూరు నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులని, గతంలో మాదిరిగా వీరిని సాగనంపాలని కోరారు. ఎంపీగా విజయసాయిరెడ్డిని.. ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొండా దేవీప్రసాద్‌రెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య, షబ్బీర్, తాతా సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ఆనందం ఆవిరై.. ఆందోళన ఆవిష్కృతమై..!

విజయం మాదేనంటూ నిన్నామొన్నటి వరకు బీరాలు పలికిన వేమిరెడ్డి దంపతులు.. ఇప్పుడు గౌరవ స్థాయిలో ఓట్లు దక్కితే చాలు భగవంతుడాననే స్థితికి వచ్చారు. డబ్బులను వెదజల్లితే ఏదైనా చేసేయొచ్చనే భ్రమలో ఉన్న వీరికి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు ఇప్పుడిప్పుడే బోధపడుతున్నాయి. తమ ప్రచారాలు.. చంద్రబాబు చేపట్టిన ప్రజాగళం సభలు వెలవెలబోవడం.. నగదు ప్రలోభాలకు గురై సైకిలెక్కిన నేతలు ఒక్కొక్కరూ తిరిగి సొంతగూటికి చేరుకుంటుండటంతో ఏమి చేయాలో పాలుపోక దిక్కుతోచక స్థితిలో వీరు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రచారాలను సైతం వీరు తగ్గించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు



- వేమిరెడ్డి శిబిరంలో ఇదీ పరిస్థితి
- క్షేత్రస్థాయిలో జనాదరణ కరువు
- వెలవెలబోయిన ప్రజాగళం సభలు
- డబ్బులకు ఆశపడి సైకిలెక్కిన నేతలు.. తిరిగి సొంతగూటికి
- నెల్లూరు లోక్‌సభ పరిధిలో ప్రచారానికి వెళ్లని వైనం
- కోవూరు అసెంబ్లీ స్థానంపైనా తగ్గిన ఫోకస్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ఎన్నికలకు పట్టుమని 12 రోజుల్లేవు. ఈ స్థితిలో ప్రచారాలతో పార్టీలు క్షేత్రస్థాయిలో తమ బలాన్ని చాటుతుంటాయి. అయితే నెల్లూరులో ప్రతిపక్ష టీడీపీ పరిస్థితి దయనీయంగా మారింది. ధనబలంతో ఏదైనా చేయొచ్చనే ధీమాతో ఇప్పటి వరకు ఉన్న వేమిరెడ్డి శిబిరంలో టెన్షన్ మొదలైంది.

నామినేషన్లకు ముందే స్పష్టత

వాస్తవానికి క్షేత్రస్థాయిలో టీడీపీకి ప్రజాదరణ లేకపోయినా.. డబ్బు మూటలతో ఓట్లు కొల్లగొట్టొచ్చనే ధీమాతో వేమిరెడ్డి దంపతులు ఉన్నారు. అయితే నామినేషన్లకు ముందే వీరికి తమ భవిష్యత్తుపై ఓ స్పష్టత వచ్చింది. మరోవైపు వేమిరెడ్డి ఆర్థిక బలంతో నెల్లూరు లోక్‌సభ పరిధిలోని టీడీపీ అభ్యర్థులు తాము గెలిచేస్తామని కలలుగన్నారు. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులపై వీరికి ఇప్పుడిప్పుడే ఓ క్లారిటీ వస్తోంది. మరోవైపు నగదు ప్రలోభాలతో టీడీపీ మాజీలను వీరు తమవైపు తిప్పుకొన్నా.. ఆ ఆనందం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది.

బూమరాంగ్..

నిజానికి వేమిరెడ్డి దంపతులకు ప్రత్యక్ష రాజకీయాల్లో ఎలాంటి అనుభవం లేదు. ఈ తరుణంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరు లోక్‌సభ, ప్రశాంతిరెడ్డికి కోవూరు అసెంబ్లీ టికెట్లను టీడీపీ కేటాయించింది. ఈ క్రమంలో తమ బలాన్ని ప్రదర్శించాలనే భావనతో నగదు ప్రలోభాలకు గురిచేసి పలువురు నేతలను వీరు ఆకర్షించారు. అయితే టీడీపీలో చేరిన నేతల్లో చాలా మంది అక్కడ ఇమడలేక తిరిగి తమ సొంతగూటికి చేరుకుంటుండటంతో వీరి వ్యూహాలు బూమరాంగయ్యాయి. మరోవైపు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కట్టబెట్టిన పదవులను అనుభవిస్తూ.. వీరు పార్టీని మారి తప్పటడుగేశారని ఆయన వర్గీయులే బహిరంగంగా చెప్తుండటం గమనార్హం.

ఏదీ ప్రజాస్పందన..?

ప్రశాంతిరెడ్డి పోటీ చేస్తున్న కోవూరుతో సహా ఏ నియోజకవర్గంలోనూ ఆశించిన స్థాయిలో ప్రజాదరణ టీడీపీకి కనిపించడంలేదు. డబ్బులిచ్చి జనాలను తరలిస్తున్నా, కొద్దిసేపటికే ముఖం చాటేస్తున్నారు. కోవూరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో ప్రజాస్పందన కానరాకపోగా, గ్రూపుల మధ్య కీచులాటలు వీరికి వెల్కమ్ పలుకుతున్నాయి. మరోవైపు కావలి, ఉదయగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభలకు జనం రాకపోవడంతో తమ రాజకీయ భవిష్యత్తుపై వీరికి ఎటూ పాలుపోవడంలేదు. స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులను కొన్నంత సులభంగా ఓట్లు బదిలీ అవుతాయనే వీరి భ్రమ సైతం తొలగిపోయింది.

నిన్ను నమ్మం బాబూ..!

టీడీపీ నిర్వహిస్తున్న ప్రజాగళం సభలకు జనాలు పలుచగా హాజరవుతున్నారు. ఆచరణ సాధ్యం కాని మేనిఫెస్టోను ప్రకటించడంతో చంద్రబాబుపై నమ్మకం మరింత సన్నగిల్లింది. ఈ తరుణంలో వరుస సెగతో ఆ పార్టీ అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

ఓటేయాలని అడిగే నాథుడేడీ..?

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఓటేయాలని అడిగే నాథుడే కరువవుతున్నారు. తనకు ఓటేయమని ప్రజలను కోరాలని వేమిరెడ్డి సూచిస్తే.. ఖర్చులకు డబ్బులివ్వందే ప్రచారం చేయలేమని అభ్యర్థులు చెప్పారని సమాచారం. మరోవైపు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో ఓటును తమకే వేయాలని.. లోక్‌సభకు సంబంధించి మీ ఇష్టమంటూ నారాయణ టీమ్ ప్రచారం చేస్తోంది. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు అభ్యర్థుల ప్రచారంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

గ్రూపులతో తలబొప్పి

కోవూరుపై ఇప్పటివరకు దృష్టి సారించిన వేమిరెడ్డి తాజాగా ఆ ఫోకస్‌ను తగ్గించారని తెలుస్తోంది. టీడీపీకి క్షేత్రస్థాయిలో బలం లేకపోవడం.. ప్యాకేజీలు ఇచ్చి తెచ్చుకున్న నేతలతో ఒరిగేదేమీ లేదని గ్రహించారు. నాలుగు గ్రూపులు వేమిరెడ్డి దంపతులకు తలనొప్పిగా పరిణమించాయి. నిన్నామొన్నటి వరకు భారీగా ఖర్చు పెట్టిన వీరు ఇప్పుడు తగ్గించేశారనే టాక్ వినిపిస్తోంది.

సైలెంట్‌గా పక్కకు తోసేశారు

కోవూరు నియోజకవర్గంలో గ్రూపు రాజకీయాలకు వ్యూహకర్త పోలంరెడ్డి దినేష్‌రెడ్డేననే ఉద్దేశంతో ఆయన్ను సైలెంట్‌గా సైడ్ చేశారని సమాచారం. ఎన్నికల ఖర్చుల వ్యవహారాలను చూసేందుకు తమ సొంత టీమ్‌ను రంగంలోకి దింపారని తెలుస్తోంది. వేమిరెడ్డి నామినేషన్ సమయంలోనూ దినేష్ ఒకింత అసంతృప్తిగా కనిపించారని ఆ పార్టీ నేతలే పేర్కొంటున్నారు. తొందరపడి నిర్ణయం తీసుకున్నాం.. తిరిగి వెనక్కి వెళ్లలేం .. ఎన్నికల తర్వాత మా వ్యాపారాలు మాకు న్యాయంటూ ముఖ్య నేతల వద్ద వేమిరెడ్డి దంపతులు వాపోయారని సమాచారం.

క్లుప్తంగా

ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రక్రియలో భాగంగా నెల్లూరు పార్లమెంట్ పరిధిలో రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను కేంద్ర ఎన్నికల పరిశీలకుడు నితిన్ సింగ్ బదారియా పర్యవేక్షణలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్‌ని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో ఈ ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో డీఆర్వో లవన్న, ఈవీఎం నోడల్ అధికారి పద్మాదేవి, కలెక్టరేట్ అధికారులు సుబ్రహ్మణ్యం, మధుసూదన శర్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై తనయుడి హత్యాయత్నం

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదని తల్లిపై తనయుడు హత్యాయత్నం చేసిన ఘటనపై నెల్లూరు చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. పుత్తా ఎస్టేట్‌కు చెందిన ఇందిర తన చిన్నకుమారుడు హరితో కలిసి నివాసం ఉంటోంది. పెద్ద కుమారుడు గిరి బీవీ నగర్‌లో ఉంటున్నాడు. హరి మద్యానికి బానిసయ్యాడు. గత నెల 29వ తేదీ రాత్రి తాగేందుకు డబ్బు ఇవ్వాలని తల్లిని అడిగాడు. ఆమె తన వద్ద లేవని చెప్పడంతో విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. విషయం తెలుసుకున్న గిరి గాయాలతో ఉన్న తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అతను బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

దోపిడీ యత్నం కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి మహిళను గాయపరిచి దోపిడీకి ప్రయత్నించాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నెల్లూరు డైకస్‌రోడ్డు ఎన్‌సీసీ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ అనే వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం లాయర్స్ కాలనీలో కోనకొండ సుజాత 2006 నుంచి నివాసం ఉన్నారు. ఈమె కుమార్తె అప్పుడప్పుడు ఇంటికి వస్తూ ఉంటుంది. 2016 మార్చి 16వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో కుమార్తె ఇంట్లో నిద్ర పోతోంది. సుజాత వేరే గదిలో ఉంది. అబ్దుల్లా ఇంట్లోకి వెళ్లి దోపిడీకి యత్నించాడు. సుజాత కుమార్తె గమనించి అడ్డుకునే యత్నం చేయగా ఆమెను రోకలిబండతో తలపై కొట్టడంతో గాయపడి స్పృహ తప్పింది. అలజడికి సుజాత బయటకు రాగా ఆమెపై మచ్చు కత్తితో దాడికి ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం అబ్దుల్లాపై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ నీరజారెడ్డి కేసు వాదించారు.

చంద్రబాబుపై బీజేపీకి నమ్మకం లేదు



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: 'ఎన్నికల హామీలను చంద్రబాబు నెరవేరుస్తాడనే నమ్మకం బీజేపీకి లేదు. అందుకనే మేనిఫెస్టోలో ప్రధాని నరేంద్రమోదీ ఫొటో పెట్టనివ్వలేదు' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఈదగాలి, తాటిపర్తిపాళెం గ్రామాల్లో బుధవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014లో చంద్రబాబు, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేసి, ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. బాబు మోసాలకు తగిన గుణపాఠం చెబుతూ ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. ఆయన విషయం బాగా తెలిసే మోదీ ఫొటో పెట్టేందుకు బీజేపీ ఒప్పుకోలేదన్నారు. నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబును మించిన వ్యక్తి రాజకీయాల్లో లేరని గ్రహించిన బీజేపీ నాయకులు ఆయన హామీలకు తమకు సంబంధం లేదని స్పష్టంగా చెప్పినట్లు అర్థమవుతోందన్నారు.

మోసం చేయరు

ఆచరణ సాధ్యమయ్యే హామీలను మాత్రమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మేనిఫెస్టోలో చెప్పారని కాకాణి అన్నారు. బాబులా ప్రజలను మోసం చేసే వ్యక్తిత్వం జగన్‌కు లేదన్నారు. వ్యవసాయం దండగని గతంలో మాట్లాడిన బాబు, ప్రస్తుతం దాని గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని తెలియజేశారు. అభివృద్ధి చేయడం, ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం బాబుకు చేతకాదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అభివృద్ధిని అడ్డుకోవడం మాత్రమే ఆయనకు తెలుసన్నారు. వలంటీర్లు ప్రతినెలా ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తుంటే తన మనుషుల చేత ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి ఆలస్యమయ్యేలా చేశాడని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. మీ ఇంట్లో మేలు జరిగిందని నమ్మితేనే నాకు ఓటు వేసి అండగా నిలవాలని ఆయన ప్రజలను కోరారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, ఎంపీటీసీ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌తోనే సాధ్యం



ప్రచారం చేస్తున్న జూపూడి ప్రభాకర్‌రావు, నాయకులు

ఉలవపాడు: సంక్షేమ పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఏపీ ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్రాధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు, రాష్ట్ర బీసీ విభాగం జోన్ 5 ఇన్‌చార్జి, ప్రకాశం జిల్లా గొర్రెల పెంపకందారుల యూనియన్ చైర్మన్ బొట్ల రామారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కరేడులో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఆయన జనరల్ స్థానాల్లో బీసీలకు సీట్లు ఇచ్చారన్నారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి ఈ ప్రాంతంలో పోటీ చేయడం ప్రజలు చేసుకున్న అదృష్టం అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి చేయడంలో ఆయన దిట్ట అన్నారు. బీసీలకు రాజ్యాధికారం అందించే దిశగా ఇక్కడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బుర్రా మధుసూదన్ యాదవ్‌కు అవకాశం ఇవ్వడంగొప్ప విషయమన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ అరుణ, నాయకులు రమణయ్య, సీతారామిరెడ్డి, వెంకటరమణయ్య, పరంధామిరెడ్డి, సుందరమ్మ, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచి చేశాం.. గెలిపించండి

- వైఎస్సార్‌సీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా



కరపత్రం అందజేస్తున్న మధుసూదన్ యాదవ్, చిత్రంలో నాయకులు

కందుకూరు: 'మా ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మంచి చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించండి' అని ఆ పార్టీ కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 11వ వార్డులోని బూడిదపాళెం, సుబేదార్ స్ట్రీట్, గోకరాజుపాళెంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ కుటుంబాల్లో మంచి జరిగితేనే ఓట్లు వేయండని అడుగుతున్న ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అదే చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు హామీలిచ్చి తర్వాత పట్టించుకోడన్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని చెప్పారు. ఆసరా, చేయూత, సున్నా వడ్డీ, పింఛన్లు, రైతు భరోసా తదితరాలను ఈ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. నేడు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందారంటే అందుకు పథకాలే కారణమన్నారు. మరో ఐదేళ్లపాటు సంక్షేమం కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు హామీలను నమ్మొద్దని హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎటువంటి అలజడి లేకుండా ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు షేక్ రఫీ, నాయకులు దండే రమేష్, దేవిశెట్టి రాజేష్, రహీం, కలికవాయి వెంకటస్వామి, సింగరాజు పవన్ కుమార్, షేక్ ముజీబ్ రెహ్మాన్, ముజాముద్దీన్, హకీం, అబ్బు, నసీర్ సందానీ, రిజ్వాన్ పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారంలో వీఓఏ

చేజర్ల: మండలంలోని యనమదల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన టీడీపీ ఎన్నికల ప్రచారంలో పొదుపు వీఓఏ పాల్గొన్నారు. అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ సునీత పాల్గొన్నట్లు బుధవారం ఎంపీడీఓ ఎస్కే కరిముల్లాకు ఫిర్యాదు అందింది. ఆయన విచారణ చేసి ఆమె ప్రచారంలో పాల్గొన్నది నిజమేనని తేల్చి తదుపరి చర్యల నిమిత్తం రిటర్నింగ్ అధికారికి నివేదిక పంపినట్లు తెలిసింది.

సకాలంలో స్పందించి..

- ఆటోలో బ్యాగ్‌ను మరచిపోయిన మహిళ
- సాంకేతికత ఆధారంగా గుర్తించి అప్పగించిన పోలీసులు



బ్యాగ్‌ను అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్

నెల్లూరు(క్రైమ్): ఆటోలో మరచిపోయిన బ్యాగ్‌ను పోలీసులు సాంకేతికత ఆధారంగా గుర్తించి బాధితురాలికి అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. కలువాయికు చెందిన చల్లా లలితమ్మ, నారాయణరెడ్డి దంపతుల కుమారుడు మల్లికార్జునరెడ్డి నెల్లూరు నగరంలోని హరనాథపురంలో నివాసం ఉంటూ రాపూరు మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఇటీవల లలితమ్మ కుమారుడి ఇంటికి వచ్చారు. బుధవారం తన స్వగ్రామానికి వెళ్లేందుకు కుమారుడి ఇంటి నుంచి ఆటోలో ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. అప్పటికే బస్సు కదులుతోంది. దీంతో ఆమె ఆటోలో రెండు బ్యాగ్‌లు ఉండగా ఒక దానిని తీసుకుని హడావుడిగా బస్సు ఎక్కేశారు. నగలు, నగదు ఉన్న బ్యాగ్‌ను మరచిపోయారు. ఈ విషయాన్ని ఆటో డ్రైవర్ సైతం గమనించకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొద్దినిమిషాలకే రెండో బ్యాగ్ కనిపించకపోవడంతో బాధితురాలు జరిగిన విషయాన్ని తన కుమారుడి ద్వారా చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ బి.అశోక్‌కుమార్ తన సిబ్బందిని అప్రమత్తం చేసి సాంకేతికత ఆధారంగా ఆటోను గుర్తించారు. గాంధీబొమ్మ వద్ద ఆటోను ఆపి అందులో ఉన్న బ్యాగ్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఇన్‌స్పెక్టర్ బ్యాగ్‌ను లలితమ్మకు అప్పగించారు. దీంతో ఆమె స్థానిక ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఎస్సై లతీఫున్నీసా, సిబ్బంది నరసయ్య, రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓటరు హెల్ప్‌లైన్ కేంద్రాల ఏర్పాటు

- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజలు తమ ఓటు ఎక్కడుందో తెలుసుకోవడానికి ఓటరు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.హరినారాయణన్ తెలిపారు. నెల్లూరు నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో బుధవారం ఈ కేంద్రాన్ని ఆయన కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఆరోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. నెల్లూరు నగరంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్మార్ట్ ఫోన్ లేనివారు అక్కడికి వెళ్లి తమ ఓటు ఎక్కడుందో తెలుసుకోవచ్చనారు. కార్యక్రమంలో నుడా వైస్ చైర్మన్ టి.బాపిరెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాలు : ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): విద్యా సంవత్సరం పునఃప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని విద్యాశాఖ ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి సూచించారు. నెల్లూరు దర్గామిట్టలో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం క్లస్టర్ రీసోర్స్ మొబైల్ టీచర్స్ (సీఆర్ఎంటీ)తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కాంప్లెక్స్ పరిధిలో కీలకంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు అందించాలన్నారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయడం, విద్యా కానుకలను పంపిణీ చేయడం, బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడం, నాడు – నేడు పనులను పర్యవేక్షించడం, ఐఎఫ్‌పీల ఏర్పాటులో సహకరించడం లాంటి సేవలందించాలని తెలిపారు. పదో తరగతిలో ఫెయిలైన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అందరూ కలిసి సమష్టిగా పని చేస్తూ ఉత్తమ ఫలితాలు తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఈఓ పీవీజే రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, కావలి డిప్యూటీ ఈఓ రఘురామయ్య, ఎస్ఎస్ఏ ఏఎంఓ సుధీర్‌బాబు, ఎంఈఓలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రక్కు

- ఐదుగురికి గాయాలు



వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్, మరో వ్యక్తి

ఉలవపాడు: ఆగి ఉన్న లారీని బొలెరో ట్రక్కు ఢీకొంది. దీంతో బొలెరో వాహనంలో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి. మండలంలోని రాజుపాళెం – చాగల్లు మధ్య జాతీయ రహదారిపై బుధవారం ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గుంటూరుకు చెందిన డి.ఆకాష్, డి.యేసోబు, ఎంవీ చైతన్య, యూనిస్‌ఖాన్, వై.కల్యాణ్ కావలికి బొలెరో ట్రక్కులో బయలుదేరారు. రాజుపాళెం జంక్షన్ దాటిన తర్వాత చెరువు వద్ద ఉన్న హోటల్ ఎదురుగా ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బొలెరో ట్రక్కు ఢీకొంది. డ్రైవర్ ఆకాష్, పక్కన ఉన్న యేసోబు వాహనంలో ఇరుక్కుపోయారు. రోడ్ సేఫ్టీ పోలీసులు వారిని బయటకు తీశారు. వారిద్దరి కాళ్లకు తీవ్రంగా, మిగిలిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ సిబ్బంది ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.92
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.40



మత్స్యకారులకు అండగా వైఎస్సార్‌సీపీ



ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలో మత్స్యకారులకు అండగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ మాత్రమేనని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిలతో కలిసి జువ్వలదిన్నె పంచాయతీలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జువ్వలదిన్నెలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారానికి కనీవినీ ఎరుగని స్థాయిలో తీరప్రాంత గ్రామాలన్నీ తరలివచ్చాయి. తీరంలోని గ్రామాల నుంచి భారీస్థాయిలో హాజరైన మత్స్యకారులు, మహిళలు జువ్వలదిన్నె వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలకు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సాగర తీరాన్ని సంపద కేంద్రంగా మార్చి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృహత్ ప్రణాళికలకు శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే పోర్టులు, హార్బర్‌లతో తీరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌లతో కావలి నియోజకవర్గంలోని తీరప్రాంతమంతా అభివృద్ధి చెందనున్నట్లు వివరించారు. జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు అనుబంధ పరిశ్రమల ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు, అదనపు ఆదాయ వనరులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలపించాలని కోరారు. తీరంలో పోర్టులు, హార్బర్ల నిర్మాణంతోపాటు మత్స్యకారులకు వేటనిషేధ సమయంలో ఇచ్చే పరిహారాన్ని రెట్టింపు చేయడంతోపాటు ప్రమాదబీమా పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి కావలి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు, మత్స్యకార నాయకులు, కాపులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

హైలెవల్ కెనాల్ పూర్తి చేసేది మేమే

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: మెట్టప్రాంతానికి సాగు, తాగునీటిని అందించే హైలెవల్ కెనాల్ పూర్తి చేసేది తామేనని, అధికారంలోకి వచ్చిన ఆర్నెల్ల వ్యవధిలోనే పూర్తి చేస్తామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మర్రిపాడు మండలం పెగళ్లపాడు, ఇర్లపాడు, సన్నువారిపల్లి, అల్లంపాడు పంచాయతీల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనం రామనారాయణ రెడ్డి తన హయాంలో హైలెవల్ కెనాల్ పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో చెప్పాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తన తండ్రి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మెట్టప్రాంతానికి సాగునీరు అందించే లక్ష్యంతో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని కోరారని, దీని ద్వారా ఉదయగిరి నియోజకవర్గానికి సాగునీరు అందుతుందని తెలిపారు. సోమశిల ద్వారా మర్రిపాడుకు సాగునీరు అందించాలని సూచించడంతో హైలెవల్ కెనాల్ ఆలోచన చేశారని, నాలుగు నెలల వ్యవధిలోనే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించారని, అనంతరం వైఎస్సార్ మరణంతో పనులు నిలిచిపోయాయని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. తన సోదరుడు, దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి రెండో విడత పనులను ప్రారంభించారని గుర్తుచేశారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం ఆరు నెలల వ్యవధిలోనే భూసేకరణ పనులను ఓ కొలిక్కి తీసుకొచ్చామని తెలిపారు. హైలెవల్ కెనాల్ పనులు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలవుతుందని తెలిపారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆత్మకూరు ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, నాయకులు సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, రసం రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీశ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఉర్లగంటి శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును బీజేపీనే నమ్మడం లేదు



వెలగపాడులో ప్రజలకు అభివాదం చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: చంద్రబాబు మేనిఫెస్టోను బీజేపీనే నమ్మడం లేదని, మేనిఫెస్టోలో బీజేపీ పేరు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కలిగిరి మండలంలోని వెలగపాడు, పెద్దఅన్నలూరు, వెంకన్నపాళెం, తెల్లపాడు గ్రామాల్లో బుధవారం ఆయన విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలోని హామీలు అమలు చేయడం సాధ్యం కాదని భావించిన బీజేపీ మేనిఫెస్టో విడుదల కార్యక్రమానికి దూరంగా ఉందని తెలిపారు. చంద్రబాబు మాటలను సొంత పార్టీ నాయకులతోపాటు బీజేపీ, జనసేన నేతలు కూడా విశ్వసించే పరిస్థితిలో లేరన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మేనిఫెస్టో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అన్నివర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని, ఉదయగిరి ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. రానున్న ప్రభుత్వంలో గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అన్నిరంగాలను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మారెళ్ల ప్రభావతి, సర్పంచ్‌లు మారెళ్ల దొరసానమ్మ, రాగి దివ్య, స్థానిక నాయకులు నాగేంద్రరెడ్డి, హజరత్, పాలయ్య, మాల్యాద్రి, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, పద్మారెడ్డి, మాధవరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఇర్మియా, కొండారెడ్డి, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సంతపేట పోలీసులు మంగళవారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు.. సంతపేట గోపీ టీస్టాల్ సెంటర్‌లో షేక్ మల్లిక తన ఇద్దరు కుమారులైన రఫీ, సర్దార్(22)లతో కలిసి నివాసం ఉంటోంది. రఫీ బంగారు పని, సర్దార్ చిన్నబజారులోని ఓ మెటల్ అండ్ స్టీల్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నారు. గత నెల 30వ తేదీ సాయంత్రం మల్లిక కోటమిట్టలోని షాదీమంజిల్ వద్దకు వెళ్లింది. ఒంటరిగా ఉన్న సర్దార్ ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు మృతుడి తల్లికి, అన్నకు సమాచారం అందించారు. వారు ఇంటికి చేరుకుని సర్దార్‌ను కిందకు దించి చికిత్సనిమిత్తం బృందావనంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని బాధిత తల్లి సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. బుధవారం ప్రభుత్వ వైద్యులు మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు.

రూ.లక్ష నగదు సీజ్

సంగం : సంగం చెక్‌పోస్ట్ వద్ద రూ.లక్ష నగదును పోలీసులు బుధవారం సీజ్ చేశారు. అల్లూరు నుంచి గొల్లకందుకూరు వెళ్తున్న వాహనంలో పోలీసులు తనిఖీ చేయగా ఎలాంటి పత్రాల్లేకుండా తరలిస్తున్న రూ.లక్ష నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే సరైన పత్రాలు చూపించాలని తెలిపారు.

శ్రామికులను గౌరవించడం అందరి బాధ్యత

- సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

నెల్లూరు సిటీ: శ్రామికులను గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ డిపో–1లో బుధవారం మేడే సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశం అభివృద్ధి సాధించాలంటే కార్మికుల శ్రమ కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ శ్రామికులను తప్పకుండా గౌరవించాలని సూచించారు. ఎవరికైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదిస్తే తాము తగిన సూచనలు, సలహాలు అందజేస్తామని తెలిపారు. మీ కేసులకు సంబంధించి లాయర్ అవసరమైతే లోక్‌అదాలత్ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ కె.మురళీకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ ఆదినారాయణ, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఏఐసీసీ వర్సస్ డీసీసీ

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థికి సహకరించని ఆ పార్టీ నేతలు
- డిపాజిట్లు అయినా వస్తాయో.. లేదోనని సందేహంలో పార్టీ శ్రేణులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలతో నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగిన మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజుకు ఆ పార్టీ జిల్లా నాయకులు ఏమాత్రం సహకరించడం లేదన్న ఆరోపణలు ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అసలే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా ఉన్న సమయంలో ఆ పార్టీ నేతల్లో నూతనోత్సాహాన్ని నింపేందుకు కొప్పుల రాజును నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. అప్పటి నుంచి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఎంపీ టికెట్ ఆశించిన డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డికి నిరాశ ఎదురుకావడంతోపాటు టికెట్ రాని సీనియర్లు వరుసపెట్టి పార్టీకి రాజీనామాలు చేశారు. ఆయన టికెట్ ఇప్పించిన ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కొందరిని పీసీసీ మార్పు చేయడంతో జిల్లాలో పార్టీ పరిస్థితి ఘోరంగా తయారైంది. రాజీనామాలు చేసిన పార్టీ సీనియర్ నేతలతో కొప్పుల రాజు మంతనాలు సాగించి తనకు సహకారం అందించాలని కోరడంతో అందుకు చాలామంది అంగీకరించారు. అయినప్పటికీ సీనియర్లతోపాటు కొందరు డీసీసీ నాయకులు ఎంపీ అభ్యర్థి ప్రచారానికి సైతం దూరంగా ఉన్నారు. దీంతో పార్టీ అధిష్టానం చివరకు జిల్లాతో పరిచయం ఉన్న పనబాక దంపతుల సహకారాన్ని కోరింది. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో చేసేదేమీలేక కొప్పుల రాజు ఒక్కడే వన్‌మెన్ ఆర్మీగా తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా



హాజరైన కార్యకర్తలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు నగరంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 21వ డివిజన్ మాగుంట లేఅవుట్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మేయర్ స్రవంతి, స్థానిక కార్పొరేటర్ మొయిళ్ల గౌరిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండడం సరైనది కాదని, ఓటు వేస్తేనే ప్రశ్నించే అవకాశం ఉంటుందని తెలిపారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతం నెల్లూరులో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేఅవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. నెల్లూరులో పుట్టి పెరిగి ఇతర దేశాల్లో, ఇతర ప్రాంతాల్లో వ్యాపారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఉన్న ప్రముఖులను ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నెల్లూరు జిల్లా అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తామని తెలిపారు.

పల్లిపాడు డైట్‌లో వీడ్కోలు సమావేశం

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు డైట్ కళాశాలలో బుధవారం 2022–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఛాత్రోపాధ్యాయుల వీడ్కోలు సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వరరావు, బాలాజీరావు, విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపల్ రమేష్, ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు

అత్యధిక మెజారిటీతో గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఖలీల్‌అహ్మద్ తదితరులు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా వి.విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ ప్రజలను కోరారు. బుధవారం నగరంలోని 3వ డివిజన్ జాఫర్‌సాహెబ్ కాలువకట్ట, వెంగళరెడ్డినగర్, 5వ డివిజన్ సత్యనారాయణపురం, పీవీనాయుడువీధి, వైకుంఠపురం, 47వ డివిజన్ చిన్నబజార్, సీమా కేఫ్ సెంటర్, గరిసిరోడ్డు, వాటర్‌ట్యాంక్ ఉర్దూ పాఠశాల వీధి, బడేసాబ్‌వీధి, 9వ డివిజన్ ఎస్.సి.బాలయ్యనగర్, రంగనాథనగర్, ఎఫ్‌సీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ హరనాథపురం సెంటర్‌లో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం, సర్వేపల్లి కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువలకు సంబంధించి రిటైనింగ్ వాల్ నిర్మాణం, నూతనంగా మరో పెన్నాబ్రిడ్జి పనులు, మైపాడురోడ్డును 4లేన్లు చేయడం ఈ విధంగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. గత ఐదేళ్లుగా ప్రజలకు కనిపించని మాజీ మంత్రి పొంగూరు నారాయణ ఎన్నికల సమయంలో వచ్చి ప్రజలకు హామీలు గుప్పిస్తున్నారని, కానీ ప్రజలు ఆయనను నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. జగనన్న నూతనంగా విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. జిల్లాకు సంబంధించి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేశారని, జిల్లాను ఏవిధంగా అభివృద్ధి చేస్తారో అందులో వివరించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంక్రాంతి అశ్విని, ఓబిలి రవిచంద్ర, పొట్లూరి రామకృష్ణఆచారి, 9వ డివిజన్ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి, నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, వైఎస్‌ఆర్‌సీపీ నగర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ (యానాదులు) పీడీ రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 3వ తరగతిలో 80 సీట్లు, 4వ తరగతిలో 74 సీట్లు, 5వ తరగతిలో 75, 6వ తరగతిలో 59, 7వ తరగతిలో 58, 8వ తరగతిలో 44, 9వ తరగతిలో 53 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆ పాఠశాలలో ఈ నెల 20వ తేదీ లోపు దరఖాస్తులు అందజేయవచ్చని తెలిపారు. వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్ ఫోన్‌నంబర్ 70320 10778లో సంప్రదించవచ్చని తెలిపారు.

నారాయణ ప్రగల్భాలు

టీడీపీ హయాంలో పేదలకు ఏనాడూ అర గజం స్థలం కానీ, ఒక్క పక్కా గృహాన్ని కానీ ఇచ్చిన దాఖలాలు లేవు. పక్కా గృహాల పేరుతో టీడీపీ నేతలకే ఒక్కొక్కరికి ఇంట్లో నాలుగైదు పేర్లతో నిధులిచ్చిన చరిత్ర వారిది. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, నారాయణ ఐదేళ్లూ రాజధాని గ్రాఫిక్స్‌తో కాలం గడిపేశారు. ఎన్నికలకు ఏడాది ముందు టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను జీవితకాలం రుణ గ్రహీతలుగా మార్చేసి వారి కష్టాన్ని దోచుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. టిడ్కో ఇళ్ల విస్తీర్ణం చూస్తే ముప్పావు సెంటు స్థలంలో గుజ్జన గూళ్లలా అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మించినప్పటికీ అవి ప్యాలెస్‌లు అన్నట్లుగా నారాయణ ప్రగల్భాలు పలుకుతున్నారు.

- టిడ్కో ఇళ్ల పేరుతో ముప్పావు సెంటు స్థలంలో ఇళ్ల నిర్మాణం
- ఈ ఇళ్లకు దరఖాస్తు ఫీజులు, డిపాజిట్లు
- 20 ఏళ్లపాటు లబ్ధిదారులపై రుణ భారం
- ఐదేళ్లూ మభ్యపెట్టి ఎన్నికలకు ఏడాది ముందు హడావుడి
- ఎన్నికల వేళ మళ్లీ అభివృద్ధి చేస్తానంటూ హామీలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నారాయణ, ఆయన బృందం టిడ్కో ఇళ్ల పేరుతో పేదలను తాకట్టు పెట్టి రూ.వేల కోట్ల దోపిడీకి పాల్పడ్డారు. ఆయనేదో ప్యాలెస్‌లు కట్టుకునేంత విశాలమైన స్థలాలు పేదలకు ఇచ్చినట్లు నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారు. 300 చ.అ. (4.16 అంకణాలు), 365 చ.అ. (5 అంకణాలు), 430 చ.అ. (5.97 అంకణాలు) వంతున జీ+ అపార్ట్‌మెంట్‌లు నిర్మించారు. ఈ ఇళ్లు గుజ్జన గూళ్లే కానీ ప్యాలెస్‌లు కావని లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలను టీడీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి పూర్తి చేయలేక.. పేదలకు పంపిణీ చేయలేక చేతులెత్తేశారు. పోనీ ఇవి పేదలకు ఉచితంగా ఇచ్చారా అంటే అదీ లేదు. ఈ ఇళ్ల కోసం బ్యాంకు రుణాలు ఇచ్చి లబ్ధిదారులు 20 ఏళ్లపాటు బ్యాంకులకు అప్పులు కట్టుకునేలా ముడిపెట్టారు.

షీర్‌వాల్ టెక్నాలజీ పేరుతో దోపిడీ

టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణంలో జరిగిన దోపిడీ అంతాఇంతా కాదు. నెల్లూరు నగరంలో ఖరీదైన ఏరియాగా పేరున్న మాగుంట లేఅవుట్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణంలో చదరపు అడుగు అప్పట్లో రూ.2,500 వరకు వెచ్చిస్తే ఆధునిక సౌకర్యాలతో కూడిన లగ్జరీ ఇంటిని పూర్తి చేసి ఇచ్చేవారు. నగర శివారు ప్రాంతాల్లో అయితే అపార్ట్‌మెంట్లు చదరపు అడుగు రూ.1,600 నుంచి రూ.1,800 వరకు మార్కెట్ ధర పలుకుతుండేది. నగర శివారు ప్రాంతాల్లో షీర్‌వాల్ టెక్నాలజీతో నిర్మించిన టిడ్కో ఇళ్లకు (జీ+3 భవన నిర్మాణాలకు) చదరపు అడుగుకు రూ.2 వేల వంతున వ్యయం చేస్తున్నట్లు చెప్పి.. ఆ మొత్తాన్ని కూడా లబ్ధిదారులపై భారం పడేలా చేశారు.

రూ.600 కోట్ల అవినీతి

టీడీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి, కొండ్లపూడి ప్రాంతాల్లో 373.19 ఎకరాల విస్తీర్ణంలో 34,032 పక్కా ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఖరీదైన ప్రాంతాల్లో ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసి నిర్మించిన భవనాలకే చదరపు అడుగుకు రూ.2,500 ఉంటే.. ప్రభుత్వ స్థలాల్లో (ఉచితం) నిర్మించిన భవనాలకు చదరపు అడుగుకు రూ.2 వేల వంతున వసూలు చేయడం వెనుక భారీ అవినీతి జరిగిందని తెలుస్తోంది. వాస్తవంగా భారీ ఎత్తున నిర్మించే భవన సముదాయం కాబట్టి చదరపు అడుగుకు రూ.1,000 వంతున ఇచ్చినా గిట్టుబాటు అవుతుంది. కానీ అప్పటి ప్రభుత్వ పెద్దలు మాత్రం పేదోడికిచ్చే పక్కా ఇళ్లపై గద్దల్లా వాలిపోయారు. ప్రతి చదరపు అడుగుకు రూ.1,000 వంతున దాదాపు రూ.600 కోట్ల వరకు అప్పటి మంత్రులు, వారి అస్మదీయులు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.లక్షల ఆస్తి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఒకేసారి జిల్లాలో లక్ష మందికి పైగా లబ్ధిదారుల కోసం విలువైన భూములను సేకరించి లేఅవుట్లు వేశారు. ఆ లేఅవుట్లలో రోడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించి పట్టణాల్లో ఒక సెంటు (6 అంకణాలు) భూమి, పల్లెల్లో సెంటున్నర (9 అంకణాలు) ఇండిపెండెంట్‌గా స్థలాలను ఇచ్చారు. ఇళ్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షల గృహ నిర్మాణశాఖ నుంచి ఆర్థిక సాయంతో పాటు ఉచితంగా ఇసుక, సబ్సిడీతో సిమెంట్, స్టీల్, ఇటుకలు సమకూర్చేలా చర్యలు చేపట్టారు. ఈ ఇండిపెండెంట్ స్థలాల్లో భవిష్యత్‌లో లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే పైన అదనపు అంతస్తులు నిర్మించుకునేందుకు కూడా అవకాశం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా అందించిన ఇళ్ల స్థలాల విలువ రూ.లక్షల్లో ఉంది.

అల్లీపురంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు



గిరిజనుల భూములు లాక్కుని..

నెల్లూరు నగరంలోని 53వ డివిజన్ పరిధిలో గాంధీ గిరిజనకాలనీ, పడుగుపాడు పంచాయతీ పరిధిలోని చంద్రమౌళి గిరిజన ప్రాంతాలకు చెందిన గిరిజనులకు 1978లో అప్పటి కలెక్టర్ శంకరన్ జనార్దన్‌రెడ్డికాలనీ రెవెన్యూ పరిధిలో 63 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను సాగు చేసుకొని జీవించేందుకు పంపిణీ చేశారు. ఆ భూముల్లో కొంతమంది గిరిజనులు సాగు చేస్తుండగా, మరికొంతమంది గిరిజనులు సాగు చేసుకోలేక విక్రయించుకున్నారు. ఆ సీజేఎఫ్ఎస్ భూములను కొనుగోలు చేసిన కొందరు చోటా నేతలు భూముల్లోని మట్టిని తోడేసి విక్రయించారు. దీంతో ఆయా భూములు రోడ్డుకు 20 అడుగుల లోతున పెద్ద, పెద్ద గుంతలతో చెరువును తలపించేలా ఉండేవి. ఈ నేపథ్యంలో హౌస్ ఫర్ ఆల్ స్కీంలో పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు భూముల అన్వేషణలో భాగంగా గిరిజనులకు సంబంధించిన సీజేఎఫ్ఎస్ భూములపై అప్పటి మంత్రి పొంగూరు నారాయణ కళ్లు పడ్డాయి. ఆ భూములను బలవంతంగా గిరిజనుల నుంచి స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నాలు జరగడంతో గిరిజనులు, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఓ దశలో తమ భూముల్లో కాలుపెడితే ఆత్మహత్యలు చేసుకుంటామంటూ ఓ గిరిజనుడు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన కూడా జరిగింది. అయినా ఏ మాత్రం లెక్కచేయని నారాయణ అధికార బలంతో ఆ భూములను స్వాధీనం చేసుకున్నారు. గిరిజనులకు నష్టపరిహారం ఇస్తామన్న హామీని కూడా విస్మరించారు. ఇలా పేదల ఉసురుపోసుకున్న నారాయణ మళ్లీ ఇప్పుడు ఎన్నికలు వచ్చేటప్పటికి ప్రత్యక్షమై నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేస్తానంటూ ప్రగల్భాలు పలుకుతున్నారు.